

<u>*కథ 1998*</u>

**2**

# దుత్తలో చెందమామ

## గోపిని కరుణాకర్

వుట్టిమింద దుత్తలో నుంచి చెందమామను తీసి ఆకాశానికి తగిలించింది మా గుడ్డెవ్వ! వెన్నెల వాన జోరోమని కురస్తా వుండాది. పాలకొండ మింద పసిడి ఎన్నెల బండరాళ్ల మింద తడి  ఎన్నెల! కొత్త చెరువు అలల మింద మిలమిలా ఎండి వెన్నెల!

పచ్చని పచ్చిక మింద పండు ఎన్నెల! చింతచెట్ల మింద చిగురు పచ్చని ఎన్నెల! తెల్లకొంగ రెక్కలమింద పాల ఎన్నెల!

ఊరంతా ఆకాశానికి ఏసిన ఎన్నెల వుయ్యాల్లో ఊయల ఊగతా వుండాది. ఆ రాత్తిరికి యట్లయినా సరే చెందమామను తీసి వుట్టి మింద దుత్తలో పెడి తింది. అప్పుడు తీసి గుడ్డెవ్వకు తెలీకుండా ఎక్కడైనా దాసిపెట్టేస్తాను. అప్పుడు ఏం చేస్తిందో చూడల్ల గుడ్డి లంజ! లేకపోతే రోజూ ఇస్తా ఇస్తానని మోసం చేస్తిందా! ఎండకాలంలో ఒక సాయంతరంపూట రెండు పదునుల వానపడింది. ఆ రాత్తిరి మా సుంకేసరి చెట్టు చుక్కల్ని పూసింది. అందే కొమ్మను పట్టుకోని వూపినాను. చుక్కలు సలసలా రాలినాయి. చుక్కల్ని వొడినిండా ఏరుకోని గుడ్డెవ్వ దెగ్గరికి పరిగెత్తుకొంటాపొయినాను.

"అవా అవా ఏమిట్ని ఏరుకొని వచ్చినానో సూడు?" అని చూపించినాను.

మా పీరుగోడు వళ్లోకి తలపెట్టి, "ఓయమ్మో! ఎన్ని చుక్కలో!" అంటా రెండు చేతుల్లోకి చెంపల్ని తీసుకోని ఇచ్చిత్తరకపొయినాడు.

"నాకు చూపించువా... నాకు చూపించువా!" అని నిక్కినిక్కి చూస్తా చేతికి పెరికింది వసంత, ఆయమ్మి అట్లా పెరికేగుందికే వొడి జారి పూడిసి నెత్తిమింద నుంచి చుక్కలు రాలిపొయినాయి.

గౌను మింద, తల మింద కొన్ని అంటకపొయి నాయి. చుక్కలగౌను, చుక్కలపూలు పట్టుకున్నట్టు ధగధగా మెరిసిపోతా వుండాది మా వసంత.

"అవా సుడా! నా గౌను మింద ఎన్ని చుక్కలుం డాయో!" అంటా సలసలా పూలు రాలినట్టు నగతా చూపించింది.

"అవి చుక్కలుగావు మినగర బూసులు," అనింది గుడ్డెవ్వ.

'మినగర బూసులా! అంటే ఏందవా?" అని అడిగినాను.

"చెప్పతా ఇటొచ్చి కుచ్చోండి," అని చెప్పింది. మేము ఆ యవ్వకల్లా ఎగమల్లుకోని కుచ్చున్నాం. మినగర బూసుల్ని ఎగరజల్లేసినాను. ఆయవ్వ ఆరేసిన సీరమింద పడి మిలమిలా మెరస్తా వుండాయి.

"చెందమామ ఆకాశానికి రాసుకోని, రాసుకోని సుంకు (పాలకంకి గింజపట్టినపుడు రాలిపోయే పొట్టు) రాలితింది. ఆ సుంకే ఈ మినగర బూసులు. ఒకసారి జీనిబాయి గువ్వలు (బంగారు పిచ్చుకలు) దేవలోకానికి పొయ్యి దేవుడ్ని ఏడుకొనినాయంట! ఏమనా?

"దేవరా దేవరా! నరులు రాత్తిరిపూట దీపాలు ఎలి గించుకొంటారు. నాగుపాములు మణుల్ని ఎలిగించు కొంటాయి. గుడ్లగూబలకు కండ్లే దీపాలు. మా గూళ్ల నిండా సీకటే, మేము ఏమిటితో దీపాలు ఎలి గించుకోవల్ల? పిల్లా పాపలుండారు మా గతి ఏం కావల్లా?" దేవుడ్ని అడిగినాయి.

అవి అట్లా దీనంగా అడిగేసరికి దేవునికి కనికరం కలిగింది.

"రాత్తిరిపూట చెందమామ ఆకాశానికి రాసుకోని రాసుకోని సుంకు రాలితింది. ఆ సుంకును తెచ్చి మీ

గూళ్లకు కరిపించుకోండి. అవే మీకు దీపాలు. అని చెప్పినాడంట దేవుడు.

''అప్పట్నుంచి జీనిబాయి గువ్వలు గూట్లో మెత్తని బంక మన్ను పెట్టుకోని, ఆ బంకమన్నుకు ఈ మినగర బూసుల్ని కరిపించుకొంటాయి. మినగర బూసులు జీనిబాయి గువ్వల గూట్లో దీపాలు,'' అని చెప్పింది గుడ్డెవ్వ.

నాకు అప్పుడనిపించింది. సుంకే ఇంత ఎలతర్ని ఇస్తే, ఇంగ చెందమామ ఎంత ఎలతర్ని ఇస్తిందో! చెందమామను తుంచుకోని జీనిబాయిల గూట్లో పెట్టుకుంటే ఎంత బాగుంటుందోగదాని? ఒకరోజు గుడ్డెవ్వ వొడిలో పోనుకోని, ఆకాశెంలో వుండే చెందమామను చూపించి ''అవా నాకు చెందమామ కావల్ల తీసిస్తావా?'' అని అడిగినాను.

''పొద్దున్నే ఇస్తాలే,'' అనింది.

''నాకు ఇప్పుడే కావల్ల తీసిమే,'' అని ఏడుపు మొగం పెట్టి, కొండులాగేసి రొమ్ముల మింద కొడతా ముదిగారం పడినాను. అట్టా కొంగు లాగేసి రొమ్ముల మింద కొట్టడమంటే నాకు బలే కుశాల! ఒగరోజు రొమ్ములు పట్టుకోని,

''మ్మేయ్? నీ దగ్గిర పాలు తాగతాను,'' అన్నేను.

''పాలుగాదు సాడుపోస్తాను తాగు నాబట్టా! నీ కండ్లల్లో పట్టడు పట్టడు పచ్చకొవ్వు పట్టుండాది. పెద్ద తాత నోట్లో నుంచి వూడిపడినట్టుండావు,'' అని తగిలీ తగలకుండా రెండు దెబ్బలేసింది ముదిగారంగా!

''ఇప్పుడు తీసిస్తే లోకమంతా సీకటై పోదా! పొద్దున్నే తీసి ఇస్తాను,'' అనింది.

పొద్దున్నే లేసి ఆ యవ్వ దెగ్గరకి పొయినాను. చెందమామను తీసి పెట్టినావని అడిగినాను.

''తీసి అద్దో ఆ వుట్టిమింద దుత్తలో ఎత్తి పెట్టుండాను. ఇప్పుడు తీసిస్తే కరిగి పూడిస్తింది. రాత్తిరికి ఇస్తాను,'' అనింది. మల్లా పొద్దుపోతానే ఆ యవ్వ దెగ్గిరికి పొయినాను.

వుట్టిమింద వుండే దుత్తను దించింది. చెందమామను రెండుచేతుల్లోకి తీసుకోని గుప్పెట మూసింది. నేను చేతుల్ని ముందుకు సాపినాను. నా చేతుల్లో పెట్టినట్టే పెట్టి ఆకాశెంలోకి ఇసిరేసి అద్దో చెందమామ అనింది.

నాకు బలే కోపం వచ్చింది. దుక్కం గూడా వచ్చింది. జుట్టు పట్టుకోని వంగబెట్టి, ''గుడ్డిలంజా! నాకు ఇవ్వకుండా ఇసిరేస్తావా?'' అని నాలుగు గుద్దులు గుద్దినాను. ఆ యవ్వ బొక్కినోరు తెరిసి కిలకిలా నగతా, ''రేపు రాత్తిరికి ఇస్తాలే,'' అనింది. మరసటిరోజు రాత్తిరి పోతే మల్లా ఆకాశెంలోకి ఎగరేసి రేపు రాత్తిరికి ఇస్తాలే అనింది. ఇట్లా పెతి రాత్తిరి ఏదో ఒకటి చెప్పి మోసం చేస్తా వుండాది. ఆమద్దెన కొన్ని రోజులు చెందమామను ఎక్కడో దాసి పెట్టేసింది.

ఈ పొద్దుమల్లా తీసి ఆకాశానికి తగిలించింది.

ఈ పొద్దు ఎట్లయినాసరే చెందమామను దొంగలించాలి. జీనిబాయిలగూడు తెచ్చి సుంకేసర చెట్టుకు కట్టినాను. 'ఆ గూట్లో చెందమామను పెట్టుకోని రోజూ నేను, పీరుగోడు, వసంతా ఆట్లాడుకొంటాం,' మొనుసులో అనుకొంటా నీలగిరి తైలం చెట్టుకాడికి యలబారినాను.

*

గుడ్డెవ్వంటే మాకు ఎంతో ఇష్టం. మేమంటే ఆమెకు పాణం. గుడ్డెవ్వ మాకు ఎన్నో కతలు చేపితింది. తినేదానికి ఏమైనా పెడితింది. మాచేత రకరకాల ఆటలు ఆడిస్తింది. ఆడపిలకాయలకైతే ముగ్గులేయడం, పూలు మాలకట్టడం, రకరకాల జడలు ఏయడం నేర్పిస్తింది.

గుడ్డెవ్వ కత చెప్పతా ములు కట్టితో మొడాల్ని (మేఘాల్ని) పొడిసి వాన కురిపిస్తింది. ఒక్కోసారి మండే ఎండలు కాస్తాయి. సముద్రాలు పొంగతాయి. చెట్లు చిగిరించి, పూలు పూస్తాయి. మాయలు ఫకీరు ఒక అడుగేసి ఏడు సముద్రాల్ని దాటేస్తాడు. ఒగరోజు ఏడు సముద్రాల్ని తలలో రాలిపోయిన ఎంటికకు కట్టుకోని ఈడ్చుకోనివచ్చి వంకబాయిలో వదిలినానని చెప్పింది. నేను తొలితా నమ్మలేదు. ''పచ్చనాకు సాచ్చిగా చెపతా వుండాను. ఇంగా కావల్లంటే నీళ్లు నోట్లో పోసుకోని చూడ,''ని కొన్ని తాపింది. 'యాక్ తూ,' అని వూంచేసి, ''నువ్వు చెప్పింది నిజమే ఉప్పగా వుండాయి,'' అన్నాను మూతి చిటపరించి. మాయవ్వ చేత్తో ముదిగారంగా తలను చెరిపేసి, ''నా పెద్దమనవడు వొట్టి వెర్రోడు,'' అని ముద్దు పెట్టుకునింది. నేను నమ్మినానుగాని మా తమ్ముడు, చెల్లెలు నమ్మలేదు. వాళ్ల దగ్గర మా గుడ్డెవ్వ పప్పులు వుడకలేదు.

రాచ్చసులైతే ఆంగు ఆంగుమంటా అరస్తావచ్చి మా గుడ్డెవ్వ చేతిలో వూతకట్టెను చూసి పరిగెత్తుకుంటా వచ్చిన దావనే పారిపోతారు. దేవతలు మా గుడ్డెవ్వను దేవలోకానికి పిలసకపొయ్యి, దేవునితోపాటు సమానమైన కుర్చీ ఏసి కుచ్చోబెడతారు. మా గుడ్డెవ్వచేత కతలు చెప్పించుకొంటారు. మా యవ్వ కత చెప్పతావుంటే

పచ్చులు, పశువులు గూడా వొళ్లు మరిసి తల వూపతా కత ఇంటాయి.

ఎండితో తాపడం చేసిన పొన్నుకర్రను చేతిలో పట్టుకోని ఒక్కొక్కసారి మంత్రగత్తెలా వుంటుంది. పొన్నుకర్ర గదైయితింది, విల్లయితింది, కత్తియితింది, పిల్లన గట్టయితింది. పొన్నుకర్రను ఎట్ల గావలంటే అట్ల ఆడిస్తా బలే తమాసాగా కత చెపితింది. ఆ పొన్నుకర్రతో ఎన్నో మాయలు మంత్రాలు చేస్తింది. ఇవన్నీ ఎక్కడ నేర్చుకొనిందో ఈ గుడ్డిలంజాని నాకు ఒగటే అనుమానం.

కతలు జెప్పే మా గుడ్డెవ్వది పెద్ద ఏడుపుకత!

గుడ్డెవ్వ మా పెద్ద తాత పరమట చెంగయ్య పెద్ద భార్య! మాయమ్మకు సొయాన మేనత్త. మా గొరైలతాత, మా చెంగయ్య తాత ఒగతల్లి బిడ్డలు. గుడ్డెవ్వ మా తాత పెద్దక్క కూతురే! మా గుడ్డెవ్వ వాళ్లది మాయల మంద కాదు, తిరప్తి కాడ వుండే ఆరేపల్లి రంగంపేట. గుడ్డెవ్వను పెండ్లి చేసుకోని అత్తారింటికే యలబారి పూడిసినాడు మా పెద్దతాత. ఆడ ఆయన కోరుసేద్దం చేసోటోడు.

చిన్నప్పుడు మా గుడ్డెవ్వకు ఎడమకన్ను పొర కప్పింది. నారావాళ్లపల్లెలో వుండే ఒక కమ్మామె వొరంటుతో (వరికర్రతో) పొర తెగ్గోస్తానని చెప్పి, కనుగుడ్డే కోసేసింది. జొన బొటబొటా కారి కన్ను లొత్తయి పూడిసింది.

అప్పట్నుంచీ అందురు 'యిజీలచ్చిమి' అనే పేరును మరిసి పొయ్యి 'ఒసే గుడ్డిదానా!' అని పిలిసేటోళ్లు.

మా పెద్ద తాతను పెండ్లి చేసుకోని ఆమె శానా కష్టాలు పడింది. మా తాతకు కోపం ఎక్కువ, దానికి తోడు లంజిల సావాసం. ఒకరోజు చెంద్రగిరికి బాడుగకు పోయి వచ్చినాడంట. ఈమె సాయంతరం నీరెండలో అదమరిసి నిద్దరపోతా వున్నింది. మా తాతకు కోపం నెత్తికెక్కింది.

బండి విప్పి, ఎద్దల్ని కట్టేసి వచ్చి మంచాన్ని తల్లకిందులు చేసినాడు. ఆ యవ్వ బిత్తరపొయ్యి పైకి లెయ్య బోయింది. అంతే చెలాకోడి తీసుకుని ఒగ పీకు పీకినాడు.

"ఓయమ్మా సస్తినే తల్లీ!" అని భీతరపు అరిసింది.

"లంజా ఆడవిదానివై వుండి పట్టపగలు తెరుసుకోని పొనుకొంటావా!" అంటా చెరా చెరాని ఇంకా నాలుగు పీకులు పీకినాడు. ఎగిసెగిసి తన్నినాడు. ఇట్లా ఆమెను రోజూ కాల్చుకు తినేవాడంట. ఇట్లా పొట్లాడుకొంటానే కీసులాడుకొంటానే ఒక కొడుకును కనింది. మా తాత మల్లా రెండో పెండ్లి చేసుకున్నాడు.

రెండో పెళ్లి చేసుకుని గుడ్డెవ్వను పూర్తిగా మరిసి పొయినాడు. ఈమె పురిట్లోని పసికందును తీసుకోని తిరమల కొండకు చేరింది. ఆమె తమ్ముడు (మాయమ్మ నాయన) దేవుని గుడిలో వాహనాలు మోసే ఉద్యోగం చేసేటోడు.

మా గుడ్డెవ్వ తిరమల కొండ మీద ఎన్నో పనులు చేసింది. కట్టెలు మోసింది. కసువు (గడ్డి) మోసింది. మా పెద్ద నాయనని ఈపుకు కట్టుకోని మిద్దె పనులకు ఇటుకలు గూడా మోసిందంట. ఆమె ఆడ కన్న అగసాట్లు పడింది.

మా పెద్ద నాయన పెద్దయిన తరువాత మల్లా ఆయన వాళ్ల నాయన దెగ్గరికే వచ్చేసినాడు. గుడ్డెవ్వ మాత్తరం కొండ మిందనే వున్నింది. మా పెద్దనాయన పెండ్లి చేసుకోని రంగంపేటలోనే వుండిపొయినాడు. మా గుడ్డెవ్వ కొన్నాళ్లు కోమటోళ్ల సత్రంలో సెత్తలు వూడిసింది. కొన్నాళ్లు వుడుకునీళ్లు కాచి కొండకు వచ్చే యాత్రికులకు అమ్మింది.

మా గుడ్డెవ్వను కట్టుకున్నోడు పట్టించుకోలేదు. కన్న కొడుకు పట్టించుకోలేదు. తోడబుట్టిన తమ్ముడూ పట్టించుకోలేదు. ఆమె వగిసిలో వున్నప్పుడు సంపాయించి ఇస్తే అందరూ చేతులు సాపినోళ్లే. వయసుడిగినప్పుడు ఆమెకు ఎవురు చెయ్యి అందించలేదు. అప్పుడు మా నాయన చెయ్యి అందించినాడు.

గుడ్డెవ్వను మా ఊరికి పిలుసుకోని వచ్చినాడు. నీలగిరి తైలం చెట్టుకింద గుడిసె కట్టిచ్చి ఇచ్చినాడు. మేనత్త కాబట్టి మాయమ్మ గూడా గుడ్డెవ్వను బాగా చూసుకొనింది. ఇంత వగిసిలో కూడా ఆమె వూరికే కుచ్చోదు. ఏంచిన చెనిక్కాయలు, చెనిగి వుంటలూ చేసి గంపలో పెట్టుకోని మా ఇస్కూలు కాడ కుచ్చుంటుంది. ఇస్కూలు వదిలేసినాక సాయిబుల పల్లికాడ బస్టాండులో కుచ్చుంటుంది. పొద్దుగూట్లో పడేసరికి దుడ్డు తిత్తిలో ఏసుకోని ఇంటికి చేరితింది.

ఇక్కడికి వచ్చి గూడా మా నాయన కష్టం వురదాగా తినకుండా ఆమె తిండి ఆమె సంపా యించుకోని తింటా వుండాది. ఇది మా గుడ్డెవ్వ కత!

ఎన్నెల కురస్తానే వుండాది. పాలకొండ తడస్తానే వుండాది. తైలమాకుల మింద కురిసిన ఎన్నెల సినుకు సినుకుగ్గా, మామింద పడతా వుండాది. ఆ వానలో ఆ ఎన్నెల్లో తడిసి ముద్దవతా వుండాము.

సక్కు పిన్నమ్మ నానపెట్టిన అనపగింజలు తెచ్చి కుచ్చినింది. ఒక్కొక్క గింజె చితకతా, నోట్లో ఒక్కాకు గానుగాడిస్తా మెల్ల కన్నేసి వెంగట్రామన్న కళ్ల ఎగ మలుపుకొని చూస్తా ఎక్కిళ్లు పెట్టినట్టు నగతా ఉండాది.

గుడ్డెవ్వ తొక్కు దంచి వుంటలు పట్టి తెచ్చింది. తలా ఒగ వుంట ఇచ్చింది. వసంత గూడా గుడ్డెవ్వ ఎన కాల్నే వుంట తింటా వచ్చింది. ఎంగట్రామన్న ఆడడం మాని కుచ్చున్నాడు. గంపడు చెనిక్కాయలు తెచ్చి వుడ్డ పోసింది. వుడ్డ ముందు ఒక్కొక్క కాయ వలస్తా కుచ్చునింది.

మేము చెనిగి వుంటల్ని కొంచెం కొంచెంగా కొరుక్కోని తింటా వుండాము.

గుడ్డెవ్వ బొడ్డులో దోపుకొన్న వక్కాకు తిత్తి తీసి వక్కపేడు, పచ్చని తమలపాకు తీసింది.

"మ్మేయ్ అంత సున్నం వుంటే పెట్టు," సక్కు సిన్నమ్మను అడిగింది.

సక్కుసిన్నమ్మ సున్నపుకాయలో నుంచి చూపుడు ఏలితో సున్నం తీసి ఆకుకు పూసింది. గుడ్డెవ్వ ఆకును మడిసి నోట్లో పెట్టుకొనింది.

"అత్తా నిన్ను ఓ మాట అడగతా ఏమీ అనుకోవు గదా!" అనింది సక్కుసిన్నమ్మ. ఏమో చెప్పని తలూపింది.

"నీకు పిలకాయలంటే పాణం. వాళ్లకు తినేదానికి ఏమైనా ఓపిగ్గా చేసిపెడతావు. కతలు చెపతావు. వాళ్లను ఆడిస్తావు. నవ్విస్తావు. వాళ్లు కుశాలగా వుంటే నీకు పిర్ర మింద పలక కొట్టినట్టు వుంటుంది. వాళ్లకు ఏమైనా నొప్పి కలిగితే నీకు ఆ పొద్దు కూడు దిగదు. వాళ్లంటే ఎందుకు నీకు అంత ఇష్టం?" అని అడిగింది.

"సందమామంటే ఎవురికి ఇష్టముండదే పిచ్చిదానా! ఆకాశెంలో వుండేది ఒక సందమామే. నా సుట్టూ సూడు ఎన్ని సందమామలుండాయో," అనింది.

ఆ మాట అన్నెప్పుడు గుడ్డెవ్వ కంట్లో సల్లగా ఎన్నెల కురిసింది.

వుంటలు తిని కత చెప్పమని అడిగినాము. నేను టెంకాయ పెళ్లికూతురు కత చెప్పమని అడిగినాను. నక్క బావ, పందిబావ కత జెప్పమని పీరుగోడు అడిగినాడు. సొరకాయ బుర్ర, పొట్టేలు కత జెప్పమని లచ్చుమక్క అడిగింది.

"మీకు ఈరోజు ఒగ కొత్త కత చెపతాను యింటారా?" అడిగింది గుడ్డెవ్వ. ఇంటామని తల లూపినాం.

గుడ్డెవ్వ కత జెప్పడం మొదలుపెట్టింది. వసంత గుడ్డెవ్వ వొడిలో కుచ్చోని కత ఇంటా వుండాది.

*

అనగనగా ఆకాశమ్మకు ఇద్దరు కొడుకులంట. పెద్ద కొడుకు పేరు సూరన్న. చిన్నకొడుకు పేరు చెంద్రన్న. తండ్రిలేని ఇద్దరి బిడ్డల్ని కష్టపడి సాకి పెద్దోళ్లను చేసింది. సదువులు, సాములు చెప్పించింది.

ఒగరోజు కొడుకులిద్దరు తల్లి దెగ్గిరికి వచ్చినారు.

"అమా! నువ్వు సెలవిస్తే దేశాటన పొయ్యొస్తా," మని అడిగినారు.

"మీరిద్దరూ నాకు రెండు కండ్లు నాయనలారా! మీరు యలబారి దేశాటనకుపోతే నాకు దిక్కు ఎవురు?" అంటా వలవలా ఏడ్చింది.

కత ఇంటా వుండే సక్కుసిన్నమ్మ కండ్లల్లో నీళ్లు తిరిగినాయి. ముక్కు సీది కొంగుతో కన్నీళ్లు తుడుసుకొనింది.

"మేము సదివిన సదువులకు దేశాటన పొయ్యొస్తేనే సార్థకం. సమచ్చరంలోపు తిరిగి వస్తాం. మమ్మల్ని దీవించి పంపు తల్లి," అని తల్లి దీవెనలు కోరినారు.

"సరే మీరంతగా పట్టుబడితే నేనెందుకు కాదనల్ల! క్షేమంగా పొయ్యి లాభంగా తిరిగిరండి. వచ్చిన తరువాత మీ మేనమామ కూతుండ్లు పగటమ్మను, రెయ్యమ్మను పెండ్లాడి సక్కంగా కాపురాలు చేసుకోండి," అని చెప్పి కొడుకులను దేశాటన పంపించింది.

తూరుపు వైపుకు సూరన్న పొయినాడు. పడమర వైపుకు సెంద్రన్న పొయినాడు.

సూరన్న తూరుపు రాజ్యాలన్నీ తిరిగి ఇంద్రపస్త రాజ్యానికి వచ్చినాడు. ఆ రాజ్యానికి రాజు వానపస్త మహారాజు. ఆయనకు ఏడుగురు కూతుండ్లు. ఏడుగురూ దేవలోకంలో వుండే ఏడురంగుల పూలను కోరినారు. ఆ పూలను తెచ్చి ఇచ్చిన వీరుడ్నే పెళ్లాడతామని కూడా శపథం చేసినారు.

దేవలోకంలో వుండే ఏడు రంగుల పూలను తెచ్చి ఇచ్చిన వీరుడుకు నా కూతుండ్లను అర్ధరాజ్యాన్ని ఇచ్చి పట్టాభిషేకం చేస్తానని రాజు దండోరా ఎయించినాడు.

రాజాతిరాజులందరూ పూలను కోయడానికి దేవలోకానికి యలబారినారు. పూలను కోస్తా మిన్నాగులు కాటేసి కొంతమంది పాణాలను ఇడిసినారు. వూపిరి వుంటే వుప్పు అమ్ముకోని బతకొచ్చని కొంతమంది వుత్త చేతుల్తో తిరిగొచ్చేసినారు. రోజులు గడస్తా వుండాయి. రోజూ దండోర ఏస్తానే వుండారు.

ఏడురంగుల పూలను ఎవురూ తేలేకుండా పోతా వుండారు. రాజుకు దిగులు పట్టుకునింది. రాజ కుమార్తెలు మొండి పట్టు వదలడం లేదు.

దండోర ఇన్నాడు సూరన్న! దేవలోకానికి యల బారినాడు. బాణాలతో ఆకాశానికి నిచ్చిన కట్టినాడు.

బుజ్జితొడ చరిసి, "బుజ్జక్క రేపు సూడు నేను గూడ ఆకాశానికి బాణాలతో నిచ్చెన కడతాను," అన్నాడు రవిగోడు.

"కత ఇంటా వుంటే నీ సొణుగుడేందిరా పుల్లకోతి నాబట్టా! గుద్ద మూసుకోనుండు," అని కసురుకొనింది బుజ్జక్క.

వాడు ఇదేమి పట్టించుకోకుండా, వాడి లోకంలో వాడు వొట్టి చేతుల్తో 'జూయ్.... జూయ్' ని ఆకాశం కల్లా ఎగమల్లుకోని బాణాలు వదలతా వుండాడు.

దేవలోకానికి పొయినాడు. మిన్నాగుల కంట్లో బాణాలను గుచ్చినాడు. ఏడురంగుల పూలను కోసుకోని నిచ్చెన మింద పరపరా దిగొచ్చినాడు. దేవలోకానికి పోయి పూలు తెచ్చిన సంగతి రాజ్యంలో అందరికీ తెలిసి పోయింది. ఈ ఇచ్చిత్తరాన్ని చూసేదానికి జనం తండోప తండాలుగా వచ్చేసినారు.

ఏడురంగుల పూలను రాజు ముందు బంగారు తట్టలో పెట్టినాడు సూరన్న. జనం చప్పట్లు కొట్టినారు. పూలు చుక్కల్లా తళతళా మెరస్తా వుండాయి. సువాసన గుబాళిస్తా వుండాది.

ఎంగట్రామన్న పైకి లేసి పై గుడ్డను గాలిలో ఇసిరి 'వుయ్... వుయ్' అని వూల ఏసినాడు.

ఏడురంగుల పూలను రాజకుమార్తెలు సిగలో ముడుచుకొన్నారు. రాజు ఏడుగురు కూతుండ్లను ఇచ్చి పెండ్లిచేసి, అర్ధరాజ్యాన్ని పట్టంగట్టి సూరన్నను రాజును చేసినాడు.

ఈ కత ఇట్లుంటే, పరమట వైపుకు పోయిన చెంద్రన్న పరమట రాజ్యాలన్నీ తిరిగి, ఒగరోజు కాకులు దూరని కారడివి గుండా గుర్రంమింద వస్తా వుండాడు. ఆ అడవిలో తపస్సు చేసుకొంటా ఓ మునీశ్వరుడు వుండాడు. ఆయనకు సూడసక్కని ఒగ కూతురుండాది. ఆ కూతుర్ని ఇచ్చి పెండ్లి చెయ్యమని ఓ బెమ్మ రాచ్చిసి మునీశ్వరుడ్ని ఏడిపిస్తా వున్నింది.

ఒగరోజు మునీశ్వరుడు లేనిది చూసుకోని, ముని కన్నెకను బెమ్మరాచ్చిసి ఎత్తకపొయ్యి ఏడు సముద్రాలకు అవతల మర్రిచెట్టు తొర్రలో దాసి పెట్టింది. మునీశ్వ రుడు దిగులుపడి కూచ్చున్నాడు, అప్పుడనంగానే మన చెంద్రన్న గుర్రం మింద పోతా దప్పికేసి నీళ్లు తాగేదానికి ఆ కుటీరానికి పొయినాడు. మునీశ్వరుడు నీళ్లు ఇచ్చి చెంద్రన్న దప్పిక తీర్చినాడు.

మునీశ్వరుడు దిగులుతో వుండడం చూసి, "ఏమి సామి దిగులుతో వుండావే!" అని అడిగినాడు చెంద్రన్న. జరిగిన కతంతా చెంద్రన్నకు చెప్పినాడు. "నువ్వు చూడబోతే రాజకుమారుడిలా వుండావు. బెమ్మ రాచ్చిసి బారి నుంచి కాపాడితే నీకు నా కూతుర్ని ఇచ్చి పెండ్లి చేస్తాను," అని చెప్పినాడు.

సెంద్రన్న గుర్రమేసుకోని ఏడు సముద్రాలు దాటి మర్రిచెట్టు కాడికి పొయినాడు. బెమ్మరాచ్చిసి 'ఆంగు ఆంగు' మంటూ చెంద్రన్న మిందకు వచ్చింది.

ఒళ్లో కుచ్చోనుండే వసంత బయపడి గుడ్డెవ్వను కరుసుకొనింది.

"నాకు బయంగా వుండాది సామి," అని పైకిలేసి పరిగెత్తి ఇంట్లోకి పొయ్యి తలుపు సాటున నిలబడి చెవులు మాత్తరం బయటపెట్టి ఇంటా వుండాడు రవి గోడు.

చెంద్రన్న ఎగిరి రాచ్చిసి మింద దూకినాడు. అది చెంద్రన్నను ఇసిరేసింది. మల్లా పైకి లేసి దుమ్ము దులపుకుని పొయినాడు. రాచ్చిసి చింతచెట్టును పెరికి చెంద్రన్న మిందకు ఇసిరింది.

చెట్టు నా నెత్తిన పడుతుందేమోనని పక్కకు వంగి నాను.

చింతచెట్టు మింద పడకుండా పక్కకు తప్పించు కొన్నాడు. మర్రిచెట్టు పెరికి రాచ్చిసి మిందకు ఇసిరి నాడు. అది పెద్ద గుండును ఇసిరింది. సెంద్రన్న పెద్ద కొండనే ఇసిరేసినాడు. ఇట్లా హోరాహోరిగా వారం రోజులు యుద్ధం జరిగింది. చివరకు దాని మెడ ఇరిసి చంపేసినాడు.

బెమ్మ రాచ్చిసి 'అలలల్లా...'ని అరస్తా నేల కొరి గింది. మునీశ్వరుడు మునికన్నెకను చెంద్రన్నకు ఇచ్చి పెండ్లి చేసినాడు.

తలుపుపాటు నుంచి వచ్చి మల్లా మా దగ్గిర కుచ్చున్నాడు రవిగోడు.

ఇద్దరు కొడుకులు వాళ్ల వాళ్ల భార్యలతో తల్లి దగ్గరకు వచ్చినారు. మేనమామ కూతుండ్లను కూడా పెండ్లి చేసుకున్నారు. పగటమ్మను సూరన్న చేసుకుంటే, రెయ్యమ్మను సెంద్రన్న చేసుకున్నాడు. చెంద్రన్న పదైదు రోజులు రెయ్యమ్మతో, పదైదు రోజులు మునికన్నెకతో కాపరం చేస్తావుండాడు. అందుకే మనకు నెలలో సగం చీకటి, సగం ఎన్నెల!

ఇట్లా కొంతకాలం జరిగింది. ఒకసారి ఆకాశమ్మకు పెద్ద జబ్బు చేసింది. సముద్రాన్ని చిలికి సల్ల తీసుకొని వచ్చి తాపిస్తే బతుకుతుందని వైదుగుడు చెప్పినాడు. అన్నదమ్ములిద్దరూ వెండికొండను కవ్వంజేసి సముద్రాన్ని చిలికినారు. రెండు దుత్తల సల్ల తీసుకొని యలబారినారు.

చెంద్రన్న నేరుగా తల్లి దగ్గరకు వచ్చినాడు. సూరన్న భార్యల దగ్గరకు పొయినాడు. అక్కచెల్లెల్లు ఏడుగురికి పగటమ్మంటే పట్టదు. పగటమ్మకు పెద్ద కోడలిగా పట్టంగట్టిన అత్తన్నా వాళ్లకు వొళ్లుమంట. అందుకే సూరన్నకు తెలవకుండా సల్లలో కారం కలిపి నారు.

చెంద్రన్న తెచ్చిన సల్ల తాగింది. కడుపు సల్ల బడింది.

"నాయనా చెంద్రన్నా నా కడుపు సల్లబరిసినావు కాబట్టి నువ్వు రెయ్యమ్మతో కలిసి సల్లంగా వుంటావు. అంతేకాదు నీ చల్లని చేతులతో ఎన్నెల కురిపిస్తావు... అందరూ నిన్ను ఇష్టపడతారు," అని దీవించింది.

సూరన్న తెచ్చిన సల్ల తాగింది. కడుపు భగభగా మండి పూడిసింది.

"నా కడుపులో మంట పెడతావా నాబట్టా! నువ్వు నీ పెండ్లాలతో కలిసి ఎప్పుడూ మండిపోతా వుంటావు. నిన్ను చూసి అబ్బా పాడు ఎండని అందరూ నిన్ను తిడతారు," అని శాపిన పెట్టింది

సూరన్న భార్యలు వచ్చి ఆకాశమ్మ కాళ్ల మింద పడినారు.

"తప్పు మాది, కారం కలిపింది మేము. నీ కొడుక్కు ఏ పాపమూ తెలవదు," అని చేసిన తప్పుకు చెంపలేసుకొన్నారు.

"తప్పు చేసింది మీరా లంజిలాల! బంగారట్లా నా బిడ్డను శాపిస్తినే. మీరు చేసిన పాపానికి అంతకు అంత శిచ్చ అనుభవిస్తారు. మీలో మీకే ఒకరంటే ఒకరికి పడకుండా పోతింది. ఏడుగురు ఏడు దావలై పోతారు. రోజూ పగటమ్మతోనే కాపరం చేస్తాడు. వానపడిన రోజు మాత్తరమే మీరు సూరన్నతో కాపురం చేసేది," అని కోడండ్లను శాపించింది.

ఎప్పుడన్నా మీరు చూసినారా? వానపడినప్పుడు కొర్రువడ్డు (ఇంద్రధనుస్సు) తుంది. ఏడు రంగులుంటాయి. రాజకుమార్తెలే ఆ ఏడు రంగులు. వాన పడినప్పుడు మాత్తరమే వాళ్లు ఒగటవుతారు.

"అందుకే గదా! తల్లి శాపిన తప్పక తగిలితిందనేది," సక్కు సిన్నమ్మ సాటువు చెప్పింది.

"ఏమీ తప్పు చెయ్యకపోయినా మండిపొమ్మని శాపిస్తినే. నేను తల్లినిగాదు కసాయి లంజిని. ఈ బతుకు బతికేమి సుగం, ఆ బోడిబండ మిందకెక్కి దూకి సస్తాను," అని బిరబిరా బోడిబండ మిందకెక్కి దూకబోయింది.

ఆకాశంలో రతమేసుకొని పోతావుండిన పార్వతి పరమేశ్వరులు చూసినారు.

"రతాన్ని దింపు సామి. ఆడ ఎవురో ఆడామే దూకి సావబోవతా వుండాది," అనింది పార్వతమ్మ.

"ఈ ఆడోల్లతో వస్తే ఇదే తకరారు. దూకిసస్తే సావని మనకేమి. నువ్వు నోరుమూసుకొని పదా!" కసురుకున్నాడు.

"నువ్వు దేవుడివా? దెయ్యానివా? మీ మగోళ్లంతా ఇంతే, అవసరమైతే మఱులిస్తారు. అవసరం తీరిపోతే కాటేస్తారు. మీది నాగుపాముల జాతికదా," అని మొగిని మింద కొట్లాడింది.

"నోరు తెరిస్తే సాలు కొట్టాడేదానికి లేసి కుచ్చుంటావు గొబ్బు నాయాలిముండా! పామును మెడలో ఏసుకోవచ్చు, బుద్దుండే ఆడదాని మెడలో తాళి కట్టగూడదు," అని సణుక్కుంటా రతాన్ని దింపినాడు.

దూకబోయే ఆకాశమ్మ కొంగుపట్టి ఆపింది పార్వతీదేవి. పార్వతీ పరమేశ్వరులను చూసి బోరోమని ఏడ్చింది. జరిగిన కతంతా చెప్పింది.

"నీ తప్పేమీ లేదు, నీకొడుకు తప్పేమీ లేదు. ఇదంతా ఆ దేవుని లీల! జరిగేదంతా మనమంచికే అంటారు. నీ పెద్దబిడ్డ జీవరాసులందరికి ఎలుగు నిస్తాడు. నీ చిన్నబిడ్డ ఎన్నెలనిస్తాడు. మేమంతా కనిపించని దేవుళ్లయితే, నీ బిడ్డలు కనిపించే దేవుళ్లు," అని పార్వతి పరమేశ్వరులు రతమేసుకొని యలబారిపోయినారు. ఆకాశమ్మ ఇంటికి పోయింది. కత కంచికి ఇంగ మనమింటికి అని సూరి చెంద్రుల కత జెప్పింది గుడ్డెవ్వ.

*

కతైపోగానే ఒక్కరొక్కరు పైకి లేచినారు. చింత కొమ్మ మింద వొదిగిన కొంగ మేలుకొని రెక్కల్ని రెపరెప లాడించింది. పాల ఎన్నెల తుంపర తుంపరగా పడింది.

"వస్తానత్తో శానా రాత్తిరి అయినట్టుండాది. అనుమంత మామ మడికలుపు తీయను పోవల్ల," అని అనప గింజలు గిన్నెత్తుకొని సక్కు పిన్నమ్మ యలబారి పూడిసింది.

వాళ్లమ్మ ఎనకాల్నే రెడ్డిగోడు పొయినాడు.

పిలకాయలందరూ దుమ్ము ఇదిలించుకొని వాళ్ల వాళ్ల ఇంటి మొగం పట్టినారు. వసంత గుడ్డెవ్వ ఒడిలో

పొనుకొనేసింది. పీరుగోడు వసంతను బుజం మిందేసుకుని, "రావా పొదాం ఇంటికి," అన్నేడు.

"నేను రాను గుడ్డెవ్వ దగ్గిరే పొనుకొంటాను," అన్నేను.

పీరుగోడు గూడా వసంతను తీసుకోని యలబారిపూడిసినాడు. గుడ్డెవ్వ వలిచిన చెనిక్కాయలను గంపలో ఎత్తి పెట్టింది. చెత్త వూడ్చి బొంత పరిసింది. వరిపొట్టుతో కుట్టిన దిండును ఏసింది.

బొంతమింద పడుకొన్నాను. గుడ్డెవ్వ దీపం ఆర్పేసి నా పక్కనే పొనుకొనింది. చిరుగుల దుప్పటిని నాకు కప్పి ఆ యవ్వ కొంగుతీసి కప్పుకొనింది. చిక్కని ఎన్నెల నా కండ్లల్లో కురస్తా వుండాది. సందమామ మజ్జిగ కుండలో ఎన్నముద్దలా తేలతా, మునగతా వుండాది. "నిన్ను ఎట్లయినా ఈ పొద్దు దొంగలించేస్తాను చూడు" అన్నాను చెందమామను చూసి.

తెల్లవారు జామున తొలి కోడి కూసింది. ఉలిక్కి పడి లేసినాను. గుడ్డెవ్వ కడవ ఎత్తుకోని చేద బాయికాడికి పొయుండాది.

గిరగిరా తిరగతా రాట్నం కిలకిలా నగతా వుండాది. గుడ్డెవ్వ ఎప్పుడూ ఇంతే, ఆమె లేసి కోడి పుంజును లేపితింది. తరువాత కోడిపుంజు పల్లెను లేపితింది. ఆకాశంలో సందమామ లేదు. అప్పుడే తీసి వుట్టి మింద దుత్తలో దాసి పెట్టినట్టుండాది. మెల్లగా అడుగులో అడుగేసుకొంటా వుట్టి దెగ్గరికి పొయినాను. వుట్టి నాకు అందే అంత ఎత్తులో లేదు. చెనిక్కాయల మూట మిందకు ఎక్కినాను.

గుడ్డెవ్వ వస్తావుండాదేమోనని వాకిలికల్లా తొంగి చూసి దుత్తను అందుకున్నాను. జాగర్తగా దిగొచ్చి దుత్తను కింద పెట్టి, మోకాళ్ల మింద కుచ్చున్నాను. దుత్త మింద వుండే మూత తీసినాను.

ఒక్కసారి మెరిసినట్టు ఎలుగు మొహం మింద పడింది. కొంచేపు కండ్లు బూసుర్లు కమ్మినాయి. దుత్త నిండా కోటి దీపాల కాంతి. సందమామ ధగధగా మెరిసి పోతా వుండాది.

దుత్తలో చేతులు పెట్టి తీసుకొందామనుకొంటే చేపపిల్లలా జారిపోతా వుండాది. జల్లెడపట్టి చేతుల్లోకి తీసుకున్నాను. చేతుల్లో ఎన్నెల ముద్ద మంచుగడ్డంత సల్లంగా వుండాది. ముద్దు పెట్టుకున్నాను. పెదాలకు సల్లంగా తగిలింది. ఒళ్లంతా జల్లుమని పులకరింత, గుడ్డెవ్వ వచ్చినట్టు అలికిడైంది.

గబగబా పైకిలేసి చెందమామను దిండుకింద దాసి పెట్టినాను. ఏమి తెలియని నంగనాచిలా దుప్పటి కప్పుకోని పడుకొన్నాను.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 5 ఏప్రిల్ 1998*

